# అద్భుత కట్టడాల సృష్టికర్తలు సగరులు

- ఘనంగా సగరుల ఆత్మీయ సమ్మేళనం
- 41రోజులు బీఆర్ఎస్ నాయకులు దీక్ష పూనాలి
- పదేండ్ల అభివృద్ధిని గడగడపకూ వివరించాలి
- ఎన్నికల ఖర్చులకు మంత్రికి రూ.లక్ష విరాళం అందజేత
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- వృద్ధురాలిని ఓటు అభ్యర్థించిన మంత్రి
- వెల్టూరులో పల్లెబస చేసిన మంత్రి
- బీఆర్ఎస్‌లో చేరిన 80 మంది కాంగ్రెస్ నాయకులు

వనపర్తి,అక్టోబర్ 16: అద్భుత కట్టడాలకు సృష్టికర్తలు సగరులేనని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాజపేట గ్రామ సమీపంలో సోమవారం ఏర్పాటుచేసిన తాపీ మేస్త్రీలు, సగరుల ఆత్మీయ సమ్మేళన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. శాస్త్ర విజ్ఞానం పొందిన వారికంటే ముందే సగరులు అద్భుతమైన కట్టడాలను చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్మాణాలు చేశారన్నారు. ప్రతి సామాజిక వర్గంలోని వారు మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తులు, ఉపాధులకు మారుతున్నారన్నారు. ఈ మధ్యకాలంలో ఉపాధి కోసం ఇతర కులాల వారు కూడా నిర్మాణరంగంలోకి అడుగుపెట్టుతున్నారన్నారు. సగర జాతిలోని బిడ్డలు ఉన్నత చదువులు చదివి మీ సామాజిక వర్గానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రతి సామాజిక వర్గానికి గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి తోడ్పాటునందించామన్నారు. రానున్న రోజుల్లో సగర కార్పొరేషన్ ఏర్పాటునకు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సాధించుకుందామన్నారు. తమ దృష్టికి వచ్చిన సగరుల సమస్యలన్నీ పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తామన్నారు. జిల్లా కేంద్రంలో మెడికల్, వ్యవసాయ, ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుతో ఈ ప్రాంత విద్యార్థులకు చక్కటి అవకాశాలు ఏర్పడాయన్నారు. అంతకుముందు భగీరథ చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అలాగే మంత్రి నిరంజన్‌రెడ్డికి గజమాలతో సగరులు సన్మానించారు. కార్యక్రమంలో సహకార యూనియన్ రాష్ట్ర సభ్యులు మోదాల పురుషోత్తం, సగర సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్యసాగర్, బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త వంగూరు ప్రమోద్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చీర్లవిష్ణుసాగర్, సగర సంఘం నాయకులు ఆర్నీ ఆంజనేయులు, చిలుక సత్యం, పోతులపల్లి రాజు, మురళీసాగర్, గోవర్ధన్‌సాగర్, పల్లె సత్యనారాయణ, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



సగర మహిళలకు అభివాదం చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

### కార్యకర్తల కృషితోనే విజయం సాధ్యం

ఖిల్లాఘణపురం, అక్టోబర్ 16 : దైవానుగ్రహంతోపాటు కార్యకర్తల కృషితో రానున్న ఎన్నికల్లో సునాయసంగా విజయం సాధించవచ్చని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గట్టుకాడిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం సీఎం కేసీఆర్ చేతులమీదుగా వనపర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా బీఫాం అందుకున్న తర్వాత నేరుగా సోమవారం గట్టుకాడిపల్లి ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ నిర్వాహకులు, అర్చకులు మంత్రికి వేద మంత్రోచ్ఛారణలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు 41రోజులపాటు దీక్ష పూని పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రానున్న ఎన్నికలను ఉద్దేశించి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోలోని పథకాలను ప్రజలకు క్లుప్తంగా వివరించాలన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం కోసమే రాష్ట్రాన్ని సాధించుకున్నామని, ఒకప్పుడు తాగునీటి కోసం బోర్లు, బావులు, చేతిపంపుల చుట్టు తిరిగిన దుస్థితిని పారద్రోలి మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధ జలాన్ని తీసుకొచ్చామన్నారు. సాగు, తాగునీటి కోసం పడ్డ కష్టాలను, పదేళ్లలో ఏవిధంగా అధిగమించామో వివరించి ఓటును అభ్యర్థించాలన్నారు. పదేండ్లలో జరిగిన అభివృద్ధి ప్రజల కళ్ల ఎదుట కనిపిస్తుందని, ప్రజలు అభివృద్ధి వైపే ఉన్నారన్నారు. రాబోయే వందేండ్లకు అభివృద్ధిలో ఎలాంటి ఆటంకం లేకుండా సీఎం కేసీఆర్ చర్యలు చేపట్టారని, 70 ఏండ్లలో ఎదుర్కొన్న అవస్థలు తొలగించే వ్యవస్థ కోసం పునర్నిర్మాణం చేపట్టి అభివృద్ధిని సాధించుకున్నామని పేర్కొన్నారు. దీక్షతో పనిచేసి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీటి కష్టాలను తీర్చామన్నారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి భారీ మెజార్టీతో పార్టీని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రమోద్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ కృష్ణా నాయక్, జెడ్పీటీసీ సామ్యనాయక్, రాష్ట్ర పాం ఆయిల్ శాఖ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్లకృష్ణయ్య, వైస్ చైర్మన్ రాజు, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### మంత్రికి సన్మానం

పెద్దమందడి, అక్టోబర్16: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి నియోజవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి నిరంజన్ రెడ్డి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకొని సోమవారం మండలకేంద్రంలోకి రాగా రైతుబంధుసమితి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి మండలకేంద్రంలో తన నివాసంలో మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో మండలం నుంచి మంచి మెజార్టీని అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పెద్దమందడి పార్టీ అధ్యక్షుడు సేనాపతి, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

## భవిష్యత్‌కు భరోసా బీఆర్ఎస్

- 70 ఏండ్ల అన్యాయాన్ని పదేండ్లలో సరిచేశాం
- సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి
- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

పెద్దమందడి, అక్టోబర్ 16: భవిష్యత్‌కు భరోసాగా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమ వారం రాత్రి మండలంలోని వెల్టూరు గ్రామంలో పల్లెబస కార్యక్రమాన్ని మంత్రి చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు తెలంగాణ రాష్ట్రానికి జరిగిన 70 ఏండ్ల అన్యాయాన్ని పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వంలో సరిచేసుకోవడం జరిగిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, కరెంట్, సంక్షేమ పథకాలతో దేశంలో రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అగ్రస్థానంలో నిలిపారన్నారు. అభివృద్ధి చేసిన ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించి అండగా నిలవాలన్నారు.

### బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

మండలంలోని వెల్టూరు గ్రామానికి చెందిన 80మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు సోమవారం రాత్రి మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ ఎస్‌లో చేరారు. ముందుగా వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముందుగా గ్రామ ప్రజలు బతుకమ్మలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు మంత్రిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు రాజాప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు మన్యపురెడ్డి, దయాకర్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సాక వెంకటయ్య, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వెంకటయ్య, గ్రామస్తులు మహేశ్, పవన్ కుమార్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

### అవ్వ.. నీ ఓటు నాకే వేస్తావు కదా!..

వనపర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి నిరంజన్‌రెడ్డి బీ ఫామ్ అందుకున్న తర్వాత మొదటి సారిగా నియోజకవర్గంలోని ఖిల్లాఘణపురం మండలం గట్టుకాడు పల్లి వేంకటేశ్వర స్వామి ని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం గ్రామంలో నడుచు కుంటూ వెళ్తుంటే అక్కడ కనిపించిన వృద్ధురాలిని పలకరించాడు. అవ్వ నీఓటు నాకే కదా అని అడుగగా ఓట్ల రోజు మా ఊర్లో నేనే మొదటి ఓటు వేస్తాను అది కూడా నీకే వేస్తా బిడ్డా ..అది కారు గుర్తుకే అని మంత్రికి ఆప్యాయంగా పట్టుకొని చెప్తున్న దృశ్యాలు నమస్తే తెలంగాణ కెమెరాలో బంధించింది..

- వనపర్తి ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ



ఎన్నికల ఖర్చుల నిమిత్తం మంత్రికి రూ. లక్ష చెక్కును విరాళంగా అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్

### ఎన్నికల ఖర్చులకు విరాళంగా రూ.లక్ష అందజేత

వనపర్తి,అక్టోబర్ 14: మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి అసెంబ్లీ ఎన్నికల ఖర్చుల నిమిత్తం బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ రూ.లక్ష చెక్కు రూపంలో అందజేశారు. సోమవారం సాయంత్రం వనపర్తి పట్టణ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతల సమావేశంలో మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో నామినేషన్ ఇతర అవసరాల కోసం వాడుకోనేందుకు తమ వంతుగా అందజేసినట్లు తెలిపారు.

### కాంగ్రెస్ వస్తే రాష్ట్రం అధోగతే

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
- ఎమ్మెల్యే ఆల సమక్షంలో బీఆర్ఎస్ చేరిన 200మంది



ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మహిళలు,యువకులు

కొత్తకోట, అక్టోబర్16: కాంగ్రెస్ వస్తే రూ.3వేల పింఛన్ పోయి రూ.200 పింఛన్ వస్తుందని, 24 గంటల విద్యుత్ పోయి 3గంటల విద్యుత్ వస్తుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని బీసీ హాస్టల్ వద్ద 10,11,12 వార్డులకు చెందిన 200 మంది కాంగ్రెస్, బీజేపీ యువకులు ఎమ్మెల్యే ఆల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో మహిళలకు ప్రాధాన్యత కల్పించే విధంగా బీమా, రూ.400 సిలిండర్ అందించే విధంగా సీఎం కేసీఆర్ రూపకల్పన చేశారన్నారు. కౌన్సిలర్ పద్మ అయ్యన్న, మార్కెట్ వైస్ చైర్మన్ యాదగిరి యాదవ్, తిరుపతయ్య, స్టార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో బీజేపీకి చెందిన మాజీ ఎంపీటీసీ సంజీవ్ అనిత, కాంగ్రెస్ మాజీ వార్డు సభ్యురాలు లలిత పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మున్సిపల్‌చైర్‌పర్సన్ సుకేశిని, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మచారిణీదేవిగా జోగుళాంబ

- విశేష పూజలందుకున్న అమ్మవారు

అలంపూర్, అక్టోబర్ 16 : అలంపూర్ క్షేత్రంలో దేవీ శరన్న వరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో సోమవారం గణపతి పూజ, చండీహోమాలు, వారోత్సవ పూజలు, దర్బార్ సేవ, నీరాజన మంత్ర పుష్పములు తదితర పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు జోగుళాంబాదేవి బ్రహ్మచారిణీ మాతగా భక్తులకు దర్శనమిచ్చింది. ఒక చేతిలో కమండలం, మరో చేతిలో పుస్తకం, జప మాల, దండం, ధరించి సాధువుగా ఉంటూ దర్శనమిచ్చే ఈ మాతను ఆరాధించడం వల్ల అరిషట్ వర్గాలను జయించవచ్చని అర్చకులు వివరించారు. జీవితంలో ఒడిదొడుకులను ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని మాత ప్రసాదిస్తుందని భక్తుల నమ్మకం. ఉత్సవాల సందర్భంగా వందన డ్యాన్స్ అకాడమీ తాడిపత్రి చిన్నారులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నది. పూజల్లో ఆలయ ఈవో పురేందర్‌కుమార్, ఆలయ ధర్మకర్తలు, పాలక మండలి చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, భక్తులు పాల్గొన్నారు.



బ్రహ్మచారిణీ రూపంలో జోగుళాంబ అమ్మవారు